"సార్- ఈడు పారిపోతుండే పట్టుకొచ్చాం సార్."

ఎదురుగా ఓ లావుపాటి కుర్రాడు. అతను పారిపోతుండే పట్టుకొచ్చిన వానర సైన్యం.

# అమ్మ

ఎన్. తారక రామారావు

"నీ పేరేమిటి?"

"ముత్తయ్య సార్." ముత్తయ్య తప్ప, తతిమ్మా పిల్లలంతా ఏకకంఠంతో చెప్పారు.

ముత్తయ్య, దొబ్బగా, నల్లని కొండరాయిలా వున్నాడు. కాకీ నిక్కరు, బనీను, చెదరిన జుత్తు రూపాయంత గుండ్రటి కళ్ళు. మొహమంతా చెమట. కళ్ళు ఎరుపెక్కి వున్నాయి. పారిపోయే ప్రయత్నంలో, మిగతా కుర్రాళ్ళతో కలబడి వుంటాడు.

"మీరంతా వెళ్ళరండి" అని చెప్పి, "ముత్తయ్యా ఆ స్టూలు లాక్కొని కూర్చో" అన్నాను.

పిల్లలు కొంతదూరం వెళ్ళి ఆగి నావేపు చూశారు. నేను ముత్తయ్యను కొడతానని వాళ్ళనుకొని వుండొచ్చు.

ముత్తయ్య కూర్చోలేదు.

నేను గడ్డం గీసుకుంటూ, అద్దంలో ముత్తయ్యనే చూస్తున్నాను.

మాది అర్ఫనేజి. అంటే అనాధాశ్రమం. బాలనేరస్తులు, అనాధలు వుంటారు. కొందరు ఏ అర్ధరాత్రో పారిపోతారు.

ఇవ్వాళ ఆదివారం. ఆశ్రమంలో అంతా చర్చిలో ప్రార్థనల కెళ్ళారు. ఇటువంటి సమయంలో, ముత్తయ్య పారిపోయే ప్రయత్నం చేశాడు.

మా నిబంధనల ప్రకారం ముత్తయ్య చేసిన నేరానికి ఆ రోజు తిండి వుండదు. అంతేగాక, భోజనశాలలో ఉండే పాత్రలన్నీ తోమాలి.

"మీ దేవూరు?"

"తిమ్మ సముద్రం!"

"మీ నాన్న ఏం చేస్తుంటాడు?"

ముత్తయ్య మాట్లాడలేదు. సమాధానం చెప్పడం ఇష్టంలేదు కాబోలు. కిటికీలోంచి మా కాంపౌండ్ ప్రక్కనే వున్న కొండవేపు చూడసాగాడు. ఆ చూపులో నిర్లక్ష్యం వుంది.

"ఇలా పారిపోయి పట్టుబడితే శిక్షేమిటో తెలుసుగా."


ముత్తయ్య మాట్లాడలేదు.

"ఇంకెప్పుడూ ఇలా పారిపోనంటే ఎవ్వరికీ చెప్పను."

ముత్తయ్య తల వంచుకున్నాడు.

చర్చిలో గంటలు కొట్టారు. ప్రార్థన కెళ్ళిన పిల్లలంతా గట్టుతెంచుకున్న వరద నీటిలా మైదానంలోకి వచ్చారు.

నేను స్నానం చేసి వచ్చేదాకా ముత్తయ్య అక్కడే వున్నాడు. పారిపోయే అవకాశం ఇహ లేదు కాబట్టి నేనూ నిర్భయంగా నా పనులు చేసుకున్నాను.



"పాలు తాగుతావా?"

ముత్తయ్య మాట్లాడలేదు.

ముత్తయ్యను తీసుకుని వంటగది దగ్గరకు వెళ్ళాను. అక్కడదాకా ముత్తయ్య పారిపోతుంటే పట్టుబడ్డాడన్న విషయం తెలిసిపోయింది. బ్రదర్ మాత్యూ అదే సంగతి అడిగాడు.

"లేదండి, ముత్తయ్యనినా దగ్గర పని వుంటే పిలిపించాను. మన కాంపౌండ్ వాల్ మీదకెక్కి వేపమంత కొయ్యబోతే. మన వాళ్ళు పారిపోతున్నాడని పట్టుకున్నారు! అంతే!"

నా సమాధానం అబద్ధమని బ్రదర్ మాత్యూ కనుక్కున్నాడు. నవ్వాడు.

"ముత్తయ్య పారిపోవడం మ జీ నీ మహమ్మదు దండయాత్ర లాంటిది!"

ముత్తయ్యంటే వున్న అభిప్రాయం అది. నే రెక్టార్ దగ్గిరి కెళ్ళాను ముత్తయ్యను తీసుకుని.




"ముత్తయ్యను నా స్వంత సంరక్షణలో వుంచుకుంటాను!" ఇది నా విజ్ఞాపన.

"ఆ ప్రభువు ఆజ్ఞ! అలాగే!"

మా రెక్టార్ వృద్ధుడు. పైగా మళయాళీ. తెలుగు అదో మాదిరిగా వుంటుంది. నెరిసిన గడ్డం. తెల్లని దుస్తుల్లో ముసలి పావురంలా వుంటాడు. ఆయనలోని ఔదార్యం. హుందాతనం గౌరవాన్నీ. ప్రేమను కలుగజేస్తాయి.ఆయన ముత్తయ్య తలమీద చెయ్యివేసి "ప్రభువైన ఏసు నిన్ను రక్షించుగాక" అని ఆశీర్వదించాడు.

అలా ముత్తయ్య నా శిష్యుడైనాడు. నా శిష్యరికంలోకొచ్చాక. ఆ రాత్రి నా ప్రక్కనే కూర్చోబెట్టుకుని -

"ముత్తయ్యా! నువ్వు దొంగవో. జాదరివో అవకుండా చూడాలనే నా ప్రయత్నం.మళ్ళీ పారిపొయ్యావో నీఅంతు చూస్తాను" అని చెప్పా. కానీ వాడి చూపులు. ప్రవర్తన నాకు వాడిమీద అనుమానం కలుగచేస్తూనే వున్నాయి.

నేను ఏ క్లాసులో వున్నా. ఏ పనిమీద వున్నా ముత్తయ్యను కనిపెడుతూనే వున్నా. ఎందుకంటే.

ముత్తయ్య తల్లీ తండ్రీ లేనివాడనీ. సమాజంలో ఆదరణ. గౌరవంలేని హరిజన కుటుంబంలో పుట్టాడనీ.వాడిని సంస్కరించి కీర్తి. నా ఉద్యోగంలో భద్రత. పై పదవి పొందాలని మాత్రం కాదు.

ముత్తయ్యలో పౌరుషముంది.వాడు పారిపోతుంటే పట్టుకున్నారన్న వార్తను నేను వేరేరకంగా చెప్పడం వాడు విన్నాడు. అందరూ దొంగగా భావిస్తున్నారు వాడిని. ఆ సంగతి వాడికి తెలుసు.అయినా ఈ కుర్ర మాష్టారు.నన్నెందుకు దగ్గరకు తీస్తున్నాడు? వీడి సంగతి తేలుద్దాం అన్న పౌరుషం ముత్తయ్య ప్రవర్తనలో. ముఖకవళికల్లో చూపుల్లో. చేష్టల్లో నాకు గోచరమైంది.

ముత్తయ్య సవాల్ని నేస్వీకరించా.

మా యిద్దరి మధ్య మూగ యుద్ధం ప్రారంభమైంది.

నేను ఈ ఉద్యోగానికి క్రొత్త. పైగా టౌనుకు చాలా దూరంగా కొండల మధ్య కట్టారు ఈ ఆర్ఫనేజి. చుట్టూ చెట్లు. ఆ తర్వాత బోడి కొండలు. ఆశ. నిర్వేదం, ఆకలి, భయం.ఏకాంతం, క్రమశిక్షణా- వీటిమధ్య పిల్లలు ఏదో పోగొట్టు

కున్నట్లుగా వుంటారు. సహజంగా పిల్లలలో వుండే చైతన్యం, సంతోషం, విచ్చలవిడితనం వాళ్ళల్లో కనబడదు. దానికితోడు, కాకీ నిక్కర్లు, బనీన్లు.... బ్రతుకంతా ఎడారిలో వున్నట్లనిపించేది నాకు చేరిన క్రొత్తలో.

ఇక బ్రదర్లంతా లేని గాంభీర్యం, పెద్దరికం ఆపాదించుకుని మిగతా వాళ్ళంతా పాపులైనట్లు, తాము పవిత్రులమైనట్లు ప్రవర్తించడం నాకు మరీ విసుగేసింది. పాతికేళ్ళ వయస్సులో కోరికలు చంపుకుని బ్రతకడం నాకిష్టంలేదు.

అందుకే ఉద్యోగంలో చేరే ముందు చెప్పాను "నాకు స్వాతంత్ర్యం కావాలి. సిగరెట్లు త్రాగుతాను, మందు తీసుకుంటాను, మాంసం తింటాను, చర్చికి ప్రార్థనకురాను సినిమాలకు వెడతాను" అని.

కమిటీ మెంబర్లంతా క్రమశిక్షణ అని అరిచారు.

రెక్టారుమాత్రం "పూలు పుయ్యద్దంటే, వాన కురవద్దంటే ఆగుతాయా! అతను నిజం చెప్పాడు. నాకు నచ్చాడు. ఏసు ప్రభువు అతనికి మంచి గుణములు ప్రసాదించుగాక!" అని ఉద్యోగం ఇచ్చాడు నా అర్హతలుచూసి—హిందువునని తెలిసికూడా.

ఇలాంటి ప్రపంచంలో ముత్తయ్య నాకు తోడు!

ముత్తయ్యకు తల్లి, తండ్రీ లేరు.

అన్నదమ్ములు, అక్క-చెల్లెండ్రు వున్నారో, లేదో తెలియదు.

కానీ ముత్తయ్య మాత్రం, "నిజం సార్! మా అమ్మ వుందిసార్!" అనేవాడు.

"ఏ వూళ్ళో ?"

బదులు చెప్పేవాడుకాదు.

"మరి నిన్ను చూడటానికి రాదేం ?"

సమాధానం లేదు.

"మీ అమ్మకు మీ రెంతమంది పిల్లలు"

"నలుగురం సార్ !"

"నిజంగా !"


"నిజం సార్, మా అన్నయ్య రమేశ్ బాబు! ఆతర్వాత నేను, నా తర్వాత రుక్మిణి, దాన్తరువాత మా బుజ్జి సార్! చిన్నది. బలే ముద్దొస్తుంది."

"అయితే మనం వెడదామా ఓ సారి!"

దానికి ముత్తయ్య బదులు చెప్పేవాడు కాదు.

నేనెన్నో సార్లు, ఎన్నో సందర్భాల్లో అడిగి చూశా! ఉహూ! వాడు నిజం చెబుతున్నాడో, అబద్ధం చెబుతున్నాడో తేల్చుకోలేకపోయ్యా.

తల్లి గురించి, తతిమ్మావాళ్ళ గురించి చెప్పేటప్పుడు వాడి మొహంలో విపరీత




మైన తేజస్సు, ఆనందం, వెలుగు వచ్చేది. నిజం కాదని ఎలా అనగలను.

"మరి నిన్ను చూట్టానికి ఎప్పుడూ రారేం?"

ముత్తయ్య మాట్లాడేవాడు కాదు.

"మా అమ్మ చాలా మంచిది సార్! ప్రొద్దున్నే లేచి, వెన్న చిలుకుతుందా! మా అందరికీ తలా ఇంత పెడుతుందిసార్. పండగలొస్తే తలంటు స్నానం చేయించేది. కొత్త బట్టలు! గుళ్ళో కెళ్ళేవాళ్ళం సార్. సార్ అక్కడ ఎప్పుడన్నా చక్రపొంగలి పెట్టేవాళ్ళు. ఎంత బావుంటుంది సార్!"

ఇలా కథలుగా చెప్పేవాడు.

"పోనీ నువ్వు ఉత్తరాలు వ్రాస్తుంటావా?"

"డబ్బులుంటే వ్రాస్తాను సార్!"

ఓ రోజు కార్డులు, కవర్లు తెచ్చి బల్లమీద పెట్టి వుంచాను. రికార్డు రూముకు వెళ్ళి ముత్తయ్యకు సంబంధించిన కాగితాలు తీసి చూశాను.

ముత్తయ్య గురించి వివరాలేం లేవు. తల్లీ తండ్రీ వూరు ఏం తెలియలేదు. రైల్లో దొంగతనం చేస్తుంటే పట్టుబడ్డాడు నాలుగేళ్ళప్పుడు. ఇక్కడకొచ్చే ఐదేళ్ళు.

ఇవన్నీ తెలిశాక ముత్తయ్యంటే అభిమానం కలిగింది. వాడిని తీసుకుని టౌను కెళ్ళేవాణ్ణి. నాతో భోజనం. సినిమాలు. షికార్లు తిప్పేవాణ్ణి.

రోజులు గడుస్తున్నాయి.

ఓ రోజు ముత్తయ్య పోస్ట్ డబ్బాలో ఉత్తరం వేయడం చూశాను. పోస్టాఫీసుకు వెళ్ళి వాడురాసిన ఉత్తరం పట్టుకుని అడ్రసు తీసుకున్నాను. ముత్తయ్య చెప్పింది, చెబుతున్నదీ నిజమే. అయితే, ఈ అడ్రసుకి వెళ్ళి ముత్తయ్య చెప్పే వాళ్ళమ్మను చూద్దామని నిశ్చయించుకున్నా.

ఓ ఆదివారం ముత్తయ్య వ్రాసిన అడ్రసు ప్రకారం వెళ్ళా.

పల్లెటూరు, వూరికో ప్రక్కన చెరువు, దాని ప్రక్కన వేణుగోపాలస్వామి ఆలయం. ఆలయ ప్రాంగణంలో ఓ తాటాకుల పాక, ఆ పాకముందు బక్క చిక్కిన ఆవు.

నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ఇంటాయన గోపాలాచార్యులు లేరు. ఆయన భార్య రంగనాయకమ్మ వచ్చింది. వచ్చి నాలుగు ఉత్తరాలు చేతికిచ్చింది.

"మీకు ముత్తయ్యనే అబ్బాయుండేవాడా !"

రంగనాయకమ్మ నవ్వింది. "లేదు బాబూ! ఒకబ్బాయి, ఇద్దరాడపిల్లలు! అంతే !"

"పేర్లు చెబుతారా ?"

"దానికేం భాగ్యం నాయనా ! పెద్దాడు రమేశ్! ఆడపిల్ల పేరు రుక్మిణి. ఆఖరిదాని పేరు తులసి !"

"బుజ్జి అనేవరు లేరా?"

"తులసినే బుజ్జిని పిలిచేవాళ్ళం?"

ముత్తయ్య వ్రాసిన ఉత్తరాలు చూశా. అందులో ఒక్కటే మాట.

"అమ్మా! నన్ను చూట్టానికి రావూ ?"

"ఎవరో బాబూ! నాలుగేళ్ళ నుంచి సంవత్సరానికోసారి ఇలా ఉత్తరం వ్రాస్తారు. ఎక్కడుంటాడో, ఎందుకిలా వ్రాస్తాడో తెలియదు " ఆమె వయసులో పెద్దది. పూచిన తంగేడులా వుంది. ఆమె మాటలు నమ్మకుండా వుండటం ఎలా?

ముత్తయ్య సంగతంతా చెప్పా. ఆమె విని వూరుకుంది.

నేలేచి వస్తుంటే నా వెనకే వచ్చింది వీధి దాకా! ఏమన్నా చెబుతుందా, ముత్తయ్య గురించి అనుకున్నా! ఉహూ!

"ఉంటా నాయనా!" అంది.

వెళ్ళేవాడిని ఆగా, నాకెందుకో ఇందులో ఏదో రహస్యం వుందని. దాన్ని తెలుసుకోవాలని అనిపించింది.

"అమ్మా! మీరు ఒక్కసారివచ్చి ముత్తయ్యను చూడకూడదూ?"

"అదెంత భాగ్యం నాయనా! తప్పకుండా వస్తాను....కానీ"

"చెప్పండి!"

"నా కొడుకులాంటివాడివి! ఏమనుకోకు! ఆ దేవుడు తప్ప మాకు దిక్కులేదు. రెక్కల కష్టంమీద బ్రతుకుతున్నాం. దూరాభారం రావాలంటే పైకం వుండాలి. ఎలా రాను?"

పెద్దతనం, ఆమె దైన్యం, పేదతనం చూశాక నాకు మాట రాలేదు. వచ్చేశాను.

నేను ఆశ్రమానికి వచ్చేసరికి ఓ ఘోరం జరిగింది. కోతి కొమ్మంచులాడుతూ చెట్టు మీద నుంచి పడి, ముత్తయ్య తల పగిలింది. ఆస్పత్రిలో చేర్చారు.

వెళ్ళి చూశాను. స్పృహలో లేదు.

"అమ్మా! అమ్మా! నన్ను చూట్టానికి రావూ !" అని కలవరిస్తున్నాడు.

"స్పృహ లేదు. సబ్‌కాన్షస్‌లో కలవ

రింతలు! అంతే!" డాక్టరు చెప్పాడు.

నాకేం చెయ్యాలో తోచలేదు. రోజులు గడుస్తున్నాయి. పరిస్థితిలో మార్పులేదు. రోజు రోజుకీ క్షీణిస్తున్నాడు తప్ప బ్రతికి మళ్ళీ మామూలు మనిషవుతాడని నాకు నమ్మకం కలగలేదు. డాక్టరూ అదే అభిప్రాయంలో వున్నాడు.

వెంటనే కొంత డబ్బు మనియార్డరు చేస్తూ తక్షణం రమ్మనీ, ముత్తయ్య ప్రమాదంలో వున్నాడనీ వ్రాశా రంగనాయకమ్మకు.

రెక్టారు మాత్రం రోజూ వచ్చి చూచి వెళ్ళేవాడు. వచ్చినప్పుడు ముత్తయ్యను చూసి ప్రార్థన చేసేవాడు. "ఏసు ప్రభువు అనుమతి ఎలా వుందో!" అనేవాడు. ఆయనొక్కడే నాకు అండ, కొండంత బలమూనూ.

"డబ్బు కావాలంటే తీసుకో నాయనా!" అని కూడా అన్నాడు నా పరిస్థితి చూసి. ఆ మనిషిలోని దైవత్వానికి నమస్కరించాను.

వారం అయింది. డాక్టర్లు ఆశ వదలుకున్నారు పూర్తిగా. శవాకారంగా ముత్తయ్య పడుకుని వున్నాడు. అంపశయ్య మీద ఏకాదశి కోసం చూస్తున్న భీష్ముడిలా.

"అమ్మా - అమ్మా. నన్ను చూట్టానికి రావూ?" ముత్తయ్య పెదవులు కదులుతున్నాయి లేని. రాని అమ్మకోసం.

గోపాలాచార్యులు. రంగనాయకమ్మ వచ్చారు. నేను వాళ్ళు రారని నిశ్చయించుకున్నా ఎప్పుడో. వాళ్ళని చూడగానే నాకు ఆశ్చర్యమేసింది.

"ఇతనేనమ్మా ముత్తయ్య!"

రంగనాకయమ్మ వస్తూనే, ముత్తయ్య ప్రక్కన కూర్చుని. అతని గుండెలు నిమిరి "నాయనా! అమ్మ నొచ్చాను చూడు" అని అంది.

"వాడు ఏ కులస్తుడో?" గోపాలాచార్యులు గునుస్తోనేవున్నాడు. "వెధవ తద్దినం. వాడు అమ్మా అనడం. ఇది తగుదునమ్మా అని రావడం! ఛ ఛ! ఇక చాల్లేరా పోదాం!...." ఇలా గోపాలాచార్లు సణుగుతూనే వున్నాడు వున్నంత సేపూ.

నే వెళ్ళి ముత్తయ్య చెవులో చెప్పా. "అమ్మ వచ్చింది ముత్తయ్యా-చూడు" అని. ఎంతో సేపటికి ముత్తయ్య కళ్ళు తెరిచాడు. రంగనాయకమ్మ ముత్తయ్యను వళ్ళోకి తీసికుని. అమృత హస్తాంతో మొహం ప్రేమతో నిమిరి "వచ్చా బాబూ! అమ్మను. మీ అమ్మను. చూడు నాయనా!" అంది ఎన్నో జన్మల బంధం వున్నట్లు.

నా కళ్ళు చెమరించాయి ఆమె అనురా...నికి. ఆప్యాయతకు.

ముత్తయ్య తదేకంగా ఆమెనే చూస్తూ వున్నాడు ఎండిన కళ్ళల్లో నీరు ద్రవించింది ఆమె. ముత్తయ్య నుదురు ప్రేమతో స్పృశించింది. "అమ్మను నాయనా!" అంది అమృతం కురిసినట్లు.

ముత్తయ్య కళ్ళు శాశ్వతంగా, తృప్తిగా మూసుకున్నాయి.

అయిపోయింది.

"ఊ! అయిందిగా! ఇక పదా!" గోపాలాచార్యులు కదిలాడు. రంగనాయకమ్మ అనుసరించింది.

వెడుతూ "నాయనా ఆ శవాన్ని ఏం చేస్తారూ?" అనడిగింది.

"పూడుస్తారు! నీకెందుకూ రాక!"

ఆమె నవ్వింది. "చూడు నాయనా. ఏ తల్లి కన్నదో. పాపం బిడ్డ అమ్మా.అమ్మా అంటూ ఆఖరి క్షణాలదాకా కలవరించాడు. అతన్ని సమాధి చేసినచోట రాతి ఫలకం పెడితే అతని అమ్మగా నా పేరు వ్రాయించు. ఆ ఆత్మ శాంతిస్తుంది."

ఆ తల్లి గోపాలాచార్యులవెంట వెళ్ళింది.

ఆ మాతృ హృదయానికి రెండు కన్నీటి బొట్లు రాల్చి మనస్సులో నమస్కారం చేశాను.


# రోజంతా తుమ్ముతూ గడపకండి



జలుబు వల్ల ఒక మంచి రోజును పాడవనివ్వకండి. ముక్కు కారడం, ఛాతీలో కఫం మరియు తలభారం. ఇవన్నీ జలుబు లక్షణాలు. మీరు బాధపడుతారు. ఒక మంచి రోజు పాడవుతుంది. మరి అలాంటప్పుడు తెలివైన పని ఎందుకు చేయకూడదు? కోల్డరిన్ వాడి చూడండి. ఇది ప్రత్యేకంగా తయారు చేయబడిన జలుబు బిళ్ల. ఎంతో అనుకూలమైనది. ఎంతో ఉపశమనం ఇస్తుంది.

జలుబుతో బాధ పడటం ఎందుకూ?
కోల్డరిన్ తీసుకోకూడదూ?




CASBC-111-124 TEL